క్లుప్తంగా

డ్రాపౌట్ విద్యార్థులను బడిబాట పట్టించండి



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో డ్రాపౌట్ విద్యార్థులను స్కూల్లో చేర్చుతున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి బడిబాట పట్టించాలని డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం 68వ వార్డు మింది, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూళ్లను సందర్శించి డ్రాపౌట్ విద్యార్థుల రికార్డులు పరిశీలించారు. డ్రాపౌట్ విద్యార్థులతో సమావేశం నిర్వహించి విద్య ప్రాముఖ్యతను వివరించి పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించారు. ఎంఈవోలు సునీత, విశ్వనాథం, స్కూల్ హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఆంజనేయ, ఇన్‌చార్జి హెచ్ఎం కుమారస్వామి, దేముళ్లు, రవిచంద్, ఇస్మాయిల్, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



వడ్లపూడిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

కూర్మన్నపాలెం: వడ్లపూడి ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం శుక్రవారం ప్రారంభించారు. సొంతంగా నిధులు సమకూర్చి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆటో డ్రైవర్లు తెలిపారు. వేసవి అంతా నిరంతరం కేంద్రాన్ని నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణ, సింహాచలం, శ్రీను, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్

ఉక్కునగరం: కూర్మన్నపాలెం స్టీల్ సిటీ డిపోలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. డిపో ప్రయాణికుల వెయిటింగ్ హాలు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ పి. శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రయాణికులకు సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. హెడ్ కానిస్టేబుల్ సత్యారావు, హెడ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ అశ్వినితో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపడం ద్వారా కార్మికుల నిరవధిక సమ్మెను నివారించాలని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. ప్లాంట్‌లో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం అక్రమంగా తొలగిస్తుందన్నారు. ఇప్పటికే 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. మరో 3 వేల మందిని తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఈ అంశంపై లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో వారు ఇచ్చిన ఆదేశాలను యాజమాన్యం పెడచెవిన పెడుతుందన్నారు. ఈ తొలగింపులకు నిరసనగా ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నారన్నారు. సమ్మె చేయకుండా కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు చర్యలను అడ్డుకుని వారి ఉపాధిని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బేకరీలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: గాజువాక కణితి రోడ్డు జగ్గు జంక్షన్ వద్ద శ్రీ లక్ష్మి జనార్దన బెంగళూరు అయ్యంగార్ బేకరీలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం రాత్రి బేకరీ మూసేసిన తర్వాత అర్ధరాత్రి సుమారు 12.45 గంటల ప్రాంతంలో బేకరీ నుంచి పొగలు రావటం చూసిన కొందరు బేకరీ బోర్డుపై ఉన్న నంబర్‌కు ఫోన్ చేశారు. బేకరీకి చేరుకున్న యజమాని వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే లోపల ఫర్నిచర్ మంటలకు ఆహుతయింది. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాక అధికారులు తెలిపారు.

సన్‌స్ట్రోక్.. బహుపరాక్



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

గాజువాక: ఈ ఏడాది మార్చి నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకనుగుణంగా జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇవీ వడదెబ్బ లక్షణాలు

మగత నిద్ర, మూర్ఛ, ఫిట్స్, కలవరింతలు, కండరాలు తిమ్మిరెక్కడం, తలనొప్పి, విపరీతమైన చెమట, అలసట, నీరసం ఎక్కువగా ఉండటం వడదెబ్బ లక్షణాలు. చెమట ఎక్కువగా పట్టి శరీరం నుంచి ద్రవాలు, లవణాలు బయటకు పోతాయి. శరీర సమతుల్యత దెబ్బ తింటుంది. దీంతో బీపీ బాగా తగ్గిపోతుంది. వడదెబ్బ తగిలినవారికి ఒక్కోసారి చెమటలు పట్టకపోవచ్చు. శరీరం మరీ వెడెక్కితే ఈ పరిస్థితి చోటుచేసుకుంటుంది. అలాంటప్పుడు మూర్ఛ, స్పృహ కోల్పోయే అవకాశం ఉంది.

బయటకు వెళ్లకుండా చూసుకోవాలి



ఈ నెల మొదటి వారం నుంచే ఎండలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే 35 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ సమయంలోనే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది. ఈ ఎండల్లో వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్తే వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. వృత్తిరీత్యా బయటకు వెళ్తున్నవారు ఎండవేడి తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యధిక పోషకాలున్న పండ్లు, నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. శరీరంలో నీటి శాతం తగ్గితే వడదెబ్బ తగులుతుంది. అందువల్ల తగిన జాగ్రత్తలు అవసరం.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఇంటినుంచి బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, స్కార్ఫ్, వాటర్ బాటిల్‌ను తీసుకువెళ్లాలి. తలకు టోపీ ధరించాలి. రోజుకు తగినంత నీరు, సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి. ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి. వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. పుచ్చకాయ, కొబ్బరి బొండాలు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. కళ్లకు వేడి తగలకుండా సన్‌గ్లాసులు పెట్టుకోవాలి. ఉడికించిన పచ్చిమామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగితే వడదెబ్బ తగలదు.

ఆ ఐదు గంటలూ అత్యంత ప్రమాదకరం



ప్రస్తుత ఎండలు అత్యంత ప్రమాదకరమైనవని గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్ చెప్పారు. ప్రతి రోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండలో తిరగరాదన్నారు. అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బకు గురై ప్రాణాల మీదకి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా సాక్షితో మాట్లాడారు.

సాక్షి : వడదెబ్బను ఎలా గుర్తించాలి. ఏ విధమైన సపర్యలు అందించాలి?

డాక్టర్ : వడదెబ్బ తగిలినవారికి అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. చెమటలు బాగా పట్టేస్తాయి. ఆందోళన పెరుగుతుంది. బాగా నీరసంగా అనిపిస్తుంది. ఎండలోకి వెళ్లి వచ్చినవారిలో ఈ లక్షణాలుంటే వారిని వెంటనే నీడలోకి తరలించాలి. వారి దుస్తులను వదులుగా చేయాలి. తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. ఓఆర్ఎస్ ద్రావణం తాగించి పారాసెటమాల్ టాబ్లెట్ వేయాలి. అప్పటికీ ఆ లక్షణాల్లో తీవ్రత తగ్గకపోతే సమీపంలో ఉన్న ఆస్పత్రిలో చూపించాలి.

సాక్షి : ఎండలోకి వెళ్లాల్సిన పరిస్థితి వస్తే?

డాక్టర్ : నేను ముందుగానే చెప్పినట్లు ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండలోకి వెళ్లకపోవడమే మంచిది. ఒకవేళ బయట ఏదైనా పని ఉంటే ఉదయం పదిలోపు ముగించుకోవడం, లేదంటే సాయంత్రం చూసుకోవడం ఉత్తమం. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ఎండ నేరుగా పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖానికి రుమాలు కట్టుకోవడం, స్కార్ఫ్‌లు ధరించడం, వీలైనన్ని ఎక్కువ సార్లు మజ్జిగ తాగడం, బార్లీ తీసుకోవడం, ఓఆర్ఎస్ ద్రావణం తాగడం వంటివి చేయాలి. లేని పక్షంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయి.

సాక్షి : పిల్లలు బయట ఆడుకోవడానికి ఇష్టపడతారు కదా?

డాక్టర్ : ఈ ఎండలు ఎవరికీ మంచిది కాదు. పిల్లలను సాయంత్రం నాలుగు తరువాతే బయట ఆడుకోవడానికి అనుమతించడం మంచిది. లేదంటే చాలా త్వరగా ఎండలబారిన పడతారు. బీపీ, షుగర్ ఉన్నవారు, గర్భిణులు, చిన్నపిల్లలు వృద్ధులు త్వరగా నీరసపడతారు. అందువల్ల వారు ఎండలోకి వెళ్లకపోవడమే మంచిది.

సాక్షి : ఈ ఎండల్లో ఎలాంటి ఆహారాన్ని తీసుకుంటే మంచిది?

డాక్టర్ : ప్రస్తుతం ఉన్న ఉష్ణోగ్రతల తీవ్రతకు మసాలాలను పూర్తిగా మానేయాలి. కూరల వేపుళ్లు తగ్గించాలి. కారం బాగా తగ్గించుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉండటం మంచిది. మాంసాహారం మానలేకపోతే బాగా తగ్గించుకోవాలి. ఉడికించిన కూరగాయలను తినడం మేలు. మంచినీళ్లు రోజుకు ఐదారు లీటర్ల వరకు తాగాలి.

సాక్షి : ఈ సీజన్‌లో ఎలాంటి పళ్లను తీసుకోవడం ఆరోగ్యకరం?

డాక్టర్ : నీటి శాతం అధికంగా ఉన్న పళ్లను తీసుకోవడం ఉత్తమం. ద్రాక్ష, పుచ్చకాయ, బత్తాయిలు, బొప్పాయి వంటి పళ్లలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఈ పళ్లను తీసుకోవడం ద్వారా ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి అవకాశం ఉంటుంది.

ప్రో కబడ్డీ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రో కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీబీఎస్ స్పోర్ట్స్ యూత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 22 నుంచి 25 వరకు ప్రో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పోటీల పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. గంగవరంలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో సింథటిక్ మ్యాట్‌పై ఈ పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.40 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, జీబీఎస్ స్పోర్ట్స్ యూత్ అధ్యక్షుడు వై. పైడిరాజు, అవతారం, దుర్గారావు, సత్యబాబు, లక్ష్మణరావు, ధనరాజు, పోలయ్య, మాడుగులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వినతి

అగనంపూడి: కూర్మన్నపాలెం నుంచి అగనంపూడి మీదుగా నిత్యం భారీ వాహనాలు, బస్సులు, హిందూజా పవర్ ప్లాంట్ బొగ్గు లారీలు ప్రయాణిస్తుండడం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు కాలుష్య సమస్య ఉత్పన్నం అవుతుందని, ఈ సమస్య పరిష్కారానికి రైల్వే ట్రాక్ పక్క నుంచి ఏలేరు కాలువ మీదుగా ఫార్మాసిటీకి ప్రత్యామ్నయ మార్గం ఏర్పాటు చేయాలని 79, 85 వార్డులకు చెందిన నాయకులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు వినతిపత్రం అందించారు. అలాగే ఫార్మాసిటీ, హోమీబాబా సంస్థలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, లంకెలపాలెం పీఏసీఎస్ భవనం శిథిలావస్థలో ఉన్నందున కొత్త భవనం నిర్మించాలని, ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో దుల్ల రామునాయుడు, బొండా అప్పారావు, గొన్నా రమాదేవి, బలిరెడ్డి సత్యనారాయణ, పావని, కసిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

అగనంపూడి: గర్భిణులు సమయానికి పౌష్టికాహారం తీసుకుంటూ, కొద్దిపాటి వ్యాయామం చేస్తూ సుఖ ప్రసవం కోసం సహకరించాలని, ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చేందుకు తోడ్పాటునందించాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు వైద్యుల సలహాల మేరకు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటూ, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకంలో గర్భిణులకు వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ర్యాలీలో ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉష, వైద్యులు గోపీకృష్ణ, ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, నర్సింగ్, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జయంత్యుత్సవాలు

అక్కిరెడ్డిపాలెం: శుక్రవారం షీలానగర్‌లోని శ్రీ స్వామి అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప పుట్టిన రోజు సందర్భంగా శ్రీ మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో చిన్నారులచే కేక్ కట్ చేయించారు. పలువురు దాతలను సన్మానించారు. రెండు రోజుల పాటు అయ్యప్ప జయంత్యుత్సవాల నుపురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు ఎస్.ఆర్.వైద్యనాథన్, కార్యదర్శి టి.నూకి నాయుడు, కోశాధికారి పి.అప్పలరాజు, నంబారు రాజు, చరపాక నాగార్జున రాజు, నంబారు రమణ, బొడ్డు చినఅప్పల స్వామి, తుమ్మలచర్ల భద్రాచలం, జక్కా కొండలరావు, మరడాని శ్రీనివాసరావు, శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు. శ్రీ స్వామి అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు, గురుస్వామి అదపాక వెంకటరమణ ఆధ్వర్యంలో సాయంత్రం ఆలయంలో శ్రీ విశ్వజ్యోతి భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్ మురళీశ్వరరావు, ఎస్.ఎ.నాయుడు, బూలిరాజు తదితరులు పాల్గొన్నారు.



షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో చిన్నారులచే కేక్ కట్ చేయిస్తున్న అతిథులు

వ్యక్తిపై పీడీ యాక్టు అమలుకు అనుమతి

అక్కిరెడ్డిపాలెం: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒకరిపై పీడీ యాక్టు అమలుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపారు. గాజువాక చినగంట్యాడకు చెందిన ఎం.వినయ్ కుమార్ (30) గంజాయి అక్రమ రవాణా, ఇతర పలు కేసులు నమోదైన నేపథ్యంలో పీడీ యాక్టు అమలుకు పోలీస్ కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన నివేదిక ఆధారం చేసుకుని అతనిపై పీడీ యాక్టు అమలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ఇప్పటికే నగర పరిధిలో 17 మందికి పైగా ఈ తరహా ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు.

హోరాహోరీగా 'వాల్తేరు క్రీడామేళా'

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్ వాల్తేరు క్రీడామేళాలో భాగంగా క్యారమ్స్ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాలు రెండింటిలోనూ ఈఎల్ఎస్‌తో సీనియర్ డీఈఈ విభాగం జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయి. శుక్రవారం జరిగిన పురుషుల సెమీఫైనల్స్ పోటీల్లో ఎస్టీ జట్టుపై ఈఎల్ఎస్, కమర్షియల్ జట్టుపై సీనియర్ డీఈఈ జట్లు విజయం సాధించాయి. క్రికెట్ పోటీల్లో సీడబ్ల్యూ జట్టు చేసిన 118 పరుగులకు ప్రతిగా డీఎల్ఎస్ జట్టు మరో ఆరు వికెట్లు ఉండగానే విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ జట్టు చేసిన 177 పరుగులకు ప్రతిగా పర్సనల్ విభాగపు జట్టు 78 పరుగులకే ఆలౌటై పరాజయం పాలైంది. ఇంజినీరింగ్ జట్టు 137 పరుగులకు ప్రతిగా డీఎల్ఎస్ పద్ధతిలో ఓవర్లను కుదించగా, ఎలక్ట్రికల్ టీఆర్‌డీ జట్టు 70 పరుగులే చేసి ఓటమి చెందింది.

సమన్వయంతోనే డ్రగ్స్ రవాణాకు చెక్

విశాఖ సిటీ: పోలీస్, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోతో పాటు అన్ని సంబంధిత శాఖలు, ప్రైవేట్ ఏజెన్సీల సమన్వయంతోనే డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డకట్ట వేయగలమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో పార్సిల్, కొరియర్, పలు రకాల ఈ-కామెర్స్ సంస్థల ప్రతినిధులతో ఎన్‌సీబీ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తన నంబర్ 7995095799కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పార్సిల్స్, కొరియర్, ఈ-కామర్స్ ద్వారా నార్కోటిక్ డ్రగ్స్ రవాణా జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఎన్‌సీబీ అధికారులు వివరించారు. రవాణా అవుతున్న పార్సిళ్లలో నార్కోటిక్ డ్రగ్స్ ఉంటే ఎలా గుర్తించాలి, ఎవరైనా డ్రగ్స్ రవాణా చేసేందుకు ప్రయత్నిస్తే సమాచారం పోలీసులకు ఎలా అందజేయాలి వంటి విషయాలపై అవగాహన కలిగించారు.



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మహాత్మా జ్యోతీరావు పూలేకు ఘన నివాళులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు



అగనంపూడిలో పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంక్షేమ సంఘం ప్రతినిధులు



మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



స్టీల్‌ప్లాంట్ ఓబీసి అసోసియేషన్ వేడుకల్లో ప్రసంగిస్తున్న జీఎం పి.ఎస్.రావు



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవింద్ తదితరులు



భెల్ టౌన్ షిప్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈడీ సుబ్రమణ్యం



కూర్మన్నపాలెం కూడలిలో పూలేకు నివాళులు అర్పిస్తున్న శ్రీనివాసరావు



పూలే విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నేత నారాయణ తదితరులు

అగనంపూడి: సామాజిక మార్పు కోసం ఉద్యమించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కొలిపాక అప్పారావు అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కరణం పైడిరాజు, కోసూరి తాతారావు, గంతకోరు అప్పారావు, బండారు చందు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో..

79వ వార్డు అగనంపూడి కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, గోపిశెట్టి సత్యారావు, తరుణ్‌కుమార్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళోద్ధరణే పూలే ఆశయం..

అక్కిరెడ్డిపాలెం: భెల్ టౌన్ షిప్‌లోని క్వార్టర్ భెల్ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భెల్ (హెచ్‌పీవీపీ) ఈడీ జి.సుబ్రమణ్యం, జీఎం (ఆపరేషన్) సి.గౌరీ శంకర్, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) జి.చంద్రశేఖర్, ఓబీసీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఉరుకూటి బాబూరావు, అధ్యక్షుడు సీహెచ్ సీతంనాయుడు, ప్రధాన కార్యదర్శి అల్లు అప్పారావు, గుర్తింపు యూనియన్ ప్రతినిధులు బొండ బాబూరావు, పి.వి.ఎస్.రాజు, రవీంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, ఇంటక్ నాయకులు సీహెచ్ మురళీశ్వరరావు, పి.ఆనంద్ కుమార్, సిటు నాయకులు జి.టి.పి.ప్రకాష్, గవర వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

పెదగంట్యాడ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని బీసీ సెల్ అధ్యక్షుడు చిత్రాడ వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, మంత్రి శంకరనారాయణ, గొందేశి మహేశ్వరరెడ్డి, పల్లా పెంటారావు, గొందేశి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గీత సహ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెల్లుబోయిన నాయుడు, వనిమి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి నడుపూరు సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సంఘం ప్రతినిధులు నెల్లి సాధూరావు, బత్తిన పరదేశి, పితాని భాస్కరరావు, డి. దేవన్‌రాజ్ పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. మదర్ థెరిసా ఫౌండేషన్ ఫౌండర్ జాగారపు శ్రీను ఆధ్వర్యంలో దళ్లివానిపాలెం కూడలిలో పూలే వేడుకలు నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, పి.వి. రమణమూర్తి, బి.ఎస్. రాజు, కొమ్ము ప్రసాద్, ఎన్. రమేష్‌కుమార్, ఎస్. వెంకన్న, మొల్లి అప్పలరాజు, గోపాలరాజు పూలేకు నివాళి అర్పించారు. ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పూలేకు నివాళి అర్పించారు. కురందాసు వంశీకృష్ణ, పి.వి. నగేష్, బి. అప్పారావు, భాస్కరరావు పాల్గొన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఉక్కునగరంలో పూలే జయంతి నిర్వహించారు. జిల్లా కార్యదర్శి టి. చిరంజీవి, వై.టి. దాస్, కె. సత్యనారాయణ, తబలా శ్రీనివాస్, వరకుమార్, ఎస్. సత్యనారాయణ, సరోజిని నాయుడు, వి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే, సావితిబాయి విగ్రహాల ఆవిష్కరణ..

స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ప్రతిష్ఠించిన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను స్టీల్‌ప్లాంట్ జీఎం పి.ఎస్. రావు ఆవిష్కరించారు. విశ్రాంత జీఎం కె. సంజీవరావు, కార్పొరేటర్ బి. గంగారావు, లైజన్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, కె.ఎస్.ఎన్.రావు, రమణమూర్తి, రామస్వామి, బయ్యే మల్లయ్య, కాటం చంద్రరావు, డి. అప్పారావు, కె. శ్రీనివాస్, పరంధామయ్య, మహాలక్ష్మి నాయుడు, ఎల్.వి. రమణ, డేవిడ్, అసోసియేషన్ నాయకులు బి. అప్పారావు, శ్రీనివాసరావు, కోయిలాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే పూలే ధ్యేయం..

కూర్మన్నపాలెం: అప్పికొండ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణు హాజరై పూలేకి నివాళులు అర్పించారు. ఎం దామోదర్, దానప్పలు, బొండా గోవిందరాజులు, ఎన్నేటి రమణ, కుమారి, గణపతి, సత్యవతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు. అలాగే కూర్మన్నపాలెం ముఖ్య కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు, కేబీఆర్ గుంజు చింతయ్య, ఈశ్వరరావు, మోదినాయుడు, పెంటారావు, గోవిందరాజులు, రమా తదితరులు పాల్గొన్నారు. కణితి నిర్వాసిత కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. 87వ వార్డు పార్టీ నాయకుడు బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూలేకు సీపీఐ ఘన నివాళి

దాబాగార్డెన్స్: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప దేశభక్తుడని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. గ్రీన్‌పార్క్ హోటల్ సమీపంలోని పూలే విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తితో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ పూలే దంపతులు సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి విశేషంగా పనిచేశారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యుల పాల్గొన్నారు.